# అభాగిని

శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు

నేను తునిరేంజిలో సబ్ అసిస్టెంటు ఇన్‌స్పెక్ట్రెస్సుగా పని చేస్తోన్నప్పుడు ఒకసారి ఒక ఊళ్లో మకాంచేసి చుట్టుపట్ల గ్రామాలలోని పాఠశాలలను పరీక్షించి వస్తోపోతో ఉన్నాను. నేను బసచేసిన యింట్లో ఒక యిరువదేండ్ల అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి ఆకులు, పూవులు రాల్చివేసిన ఒక మోడు లతకూన వలె తిరుగుతోంది ఆ యింట్లో. ఎక్కడా వస్తువుకాని, శుభ్రమైన బట్టకాని, శరీరమున కేవిధమైన సంస్కారముగాని లేకపోయినా భగవంతుడిచ్చిన ఆ సహజసౌందర్యం, సునిశితములైన అమాయకపు చూపులు, విషాద రేఖలతో నిండి జాలిగొలుపుచున్న ఆమె ముఖపద్మము చూచువారల నవలీలగా నాకర్షించుచున్నది. నేను వస్తోపోతో ఉడడం. నా దగ్గర ఉపాధ్యాయులు, బంట్రోతు, గుమాస్తా వాళ్లూ భయభక్తులతో నిలబడి నా సౌకర్యములన్నీ చూస్తో ఉండడం గమనిస్తోంది.

రాత్రి పడుకొన్నాను. నిద్రలో పెద్ద కేకలు వినపడ్డాయి. హడలిపోయి లేచాను. ఆ అమ్మాయి యింట్లోవాళ్ల మీద కేకలు వేస్తోంది దగ్గరకు వచ్చిన వాళ్లను కొట్టబోతోంది. ఒక గదిలో పెట్టి తలుపు వేశేశారు. కొంత సేపయాక పెద్ద యేడుపు, అంతలోనే నవ్వు, పాటలు తెల్లవార్లు నిద్రపట్టలేదు. ప్రొద్దున్న నేను పాఠశాల పరీక్ష నిమిత్తం ఒక ఊరు వెడుతో ఉంటే వీధివైపు కిటికీలో కూర్చుని నన్ను పిలిచింది. నేను వెళ్లబోతోంటే నా కూడా ఉన్న ఉపాధ్యాయులు, అక్కడున్నవారు ఆమె పిచ్చిది నిన్నటినుండి పిచ్చి మరీ యెక్కువయింది. అందర్నీ పట్టుకొని కొడుతుంది. దగ్గరకు వెళ్లవద్దని వారింపబోయారు. ఆమె వాళ్ల కేసి గ్రుడ్లు పెద్దవిచేసి కోపంగా చూసింది. చూశారా? ఏలా చూస్తోందో వెళ్లవద్దన్నారు. ఆమె నావైపు ప్రసన్నవదనయై వుంటము చూశాను. భయంలేదని సమీపమునకు వెళ్లాను. మిమ్మల్ని చూస్తే నాకు చాలా సంతోషంగా ఉందడీ. మీరెంత అదృష్టవంతులో అని పక పక నవ్వింది. అంతలోనే మళ్లీ ఏడ్పు. ఆ ఏడ్పులో ఆమె ఆవేదనస్ఫురిస్తోంది. నేను బయలుదేరి వెళ్లిపోయాను. అక్కడున్న వాళ్లు ఆమెకు మద పిచ్చీ పాపం ఇంట్లో వాళ్లని ఆలావేపుకు తింటో ఉంటుందని చెప్పారు. మదపిచ్చి అంటే యేమిటో నా కర్థం కాలేదు. దాని అర్థమేమిటని అడిగాను. ఆమె బాల వితంతువు. ఇప్పుడు పెండ్లి, భర్తలేక పోవుటచేత అలా పిచ్చి యెత్తిందని చెప్పారు. పోనీ పెళ్లిచేయక పోయారా? అన్నాను. వెధవ పిల్లకు పెండ్లేమిటన్నారు. యుక్తవయసులో నున్న రాజకుమార్తెలు పడే విరహతాపం ఆ తాపానికి చేసే పరిచర్యలు ప్రాచీన కవులు ప్రబంధములలోను, కావ్యములలోనూ అతి చమత్కారంగా శృంగారంగా వర్ణిస్తోవచ్చారు. దానికే యీ రోజులలో మదపిచ్చి అని, హిస్టీరియా యని రసికత, కవిత్వ ధోరణి, లేనట్టి ఇతరుల మనోభావములను కనిపెట్ట లేని ఈ కాలపు మోటు ప్రజలు పేర్లు పెట్టారు కాబోలు ననుకొన్నాను, పాపం ఆ అమ్మాయిని చూస్తే నాకు చాలా జాలివేసింది. ఆమె వద్ద కాసేపు కూర్చుని ఆమె కథ అంతా తెలిసికోవాలని అనిపించింది. చెప్పనిస్తారా? వాళ్ల వాళ్లు.

కాంపు అయిపోయింది. ఇంటికి వచ్చేశాను. నా మనస్సంతా అభాగ్యురాలైన ఆ అమ్మాయి మీదనే యున్నది. ఆ జాలి చూపులు నా హృదయంలో బాగా నాటిపోయాయి. రాజమండ్రి ఉన్నత బాలికా పాఠశాలలో పని చేస్తోన్న నా స్నేహితురాలు తునిలో నున్న తన అన్నగారింటికి వచ్చింది. ఒక రోజున ఆమె నేను మన సంఘంలో స్త్రీలకు జరుగుతూ ఉన్న అనేక అన్యాయములను గురించి మాట్లాడుకొంటున్నాం. ఆ సందర్భంలో నేను కాంపులో జూచిన అమ్మాయి సంగతి చెప్పాను. పాపం ఆమెకు పిచ్చట. ఆమె ఆలా బాధపడుతోంటే వాళ్లవాళ్లు ఆమెకు పెండ్లి యెందుకు చేయగూడదో అన్నాను. ఆమె ముఖం ఎఱ్ఱగా కందిపోయింది. చాలా కోపం వచ్చింది. పండ్లు కొరికింది. దానికి పిచ్చి ఏమీ ఆ చెప్పిన వాళ్ల కేనసీ వాళ్లుదాని పాలిటి బ్రహ్మ రాక్షసులు అనీ అంది. సంగతేమిటన్నాను. ఆమె సంగతి ఇలా చెప్పింది. నా స్నేహితురాలు లక్ష్మి.

“ఆ అమ్మాయి నా పినతండ్రి కూతురు. దానికీ, నాకూ ఒకసారే పెండ్లిండ్లయాయి. పెండ్లినాటికి నాకు పదవ యేడు దానికి ఏడవ యేడు. మా దురదృష్టంకొలది మా యిర్వురకు కొన్ని నెలలు హెచ్చుతగ్గుగా భర్తలు పోవడంకూడా ఒకసారే సంభవించింది. మా అమ్మ మంచి ధైర్యవంతురాలు స్వతంత్ర శక్తి కలదీ యగుటచేత తన అన్నదమ్ములు తన నెంత నిందించినా దూషించినా, వెలివేసినా లెక్కచేయక విశాఖపట్టణంలో కాపురం

పెట్టి నన్ను చదివించింది. నాకు మళ్లీ పెళ్లి చేస్తానంది. మా బావగారుకూడా నీకు పెండ్లి తలపు ఉంటే చేస్తాం చేసికోవచ్చు నమ్మా అని అనేక సార్లు చెప్పారు. కాని నాకు ఈ జీవితమే బాగున్నట్లు తోచింది. పెండ్లి కిష్టపడలేదు. నా కిప్పుడే లోటూ లేదు. జీవితము చాలా సుఖంగా జరిగిపోతోంది. పెండ్లి చేసికొంటే ఆ జీవిత మెట్లుండునో ఎవరు చెప్పగలరు? చేసికొన్న వాళ్లంతాపడే సౌఖ్యం చూస్తోన్నాం కదా. మళ్లీ ఆ భర్తా పోతే జీవితం ఎందునా పొందకుండా అవుతుందేమో.

నా పినతండ్రికి నలుగురు కొమాళ్లు, కూతురు ఈమె ఒక్కర్తే ఆడపిల్ల యగుట చేతను కడసారమగుట చేతను మంచి సౌందర్యవంతురాలగుట చేతను తలిదండ్రులు, అన్నలు అతి ముద్దుగా గారాబంగా పెంచారు. దానికి సౌందర్యవల్లి అని పేరు పెట్టారు. మంచి గొప్ప సంబంధం చూసి పెండ్లి చేశారు. సరి. పెండ్లయిన కొలది రోజులకే అ కుఱ్ఱవాడు చనిపోయాడు. ఆ బెంగతో మంచం పట్టి మరి మూడు నెలలకు ఆమె తల్లి పోయింది. ఇంకో సంవత్సరానికే తండ్రి గతించాడు. అయినా తలిదండ్రులు లేని లోపంలేకుండా అన్నగార్లు పాపం చాలా ముద్దుగానే చూచుకొంటున్నారు. అది చాలా తెలివైన పిల్ల మంచి చురుకైనది కూడాను. దాని కోరికలన్నీ ఆకాశంలోకి వెళ్లిపోతో ఉండేవి. ఆ పల్లెటూళ్లో ఏదో కొంతవరకు చదివించారు బడిమానినా ఇంట్లో ఉండి నవలలు, నాటకాలు కావ్యాలు, ప్రబంధాలు మొదలైన పుస్తకాలన్నీ బాగా చదివింది. నా వలెనే విశాఖపట్నం వచ్చి చదువుకోవాలని మహా ఉండేది ఆమెకు. ఇంట్లో నలుగురు వదినగార్లు కంటోపెంచుతో ఉన్నారు. చాకిరీ కావాలి ఆమెను వదిలి పెడతారా వాళ్లు? పెద్ద వదినగారు రెండవ ఆమె ఓర్వలేని తనానికి పుట్టినిండ్లు. అన్నగార్లు ఈమెతో కాస్త ప్రేమగా మాట్లాడితే సహించలేక పోయేవారు. వాళ్లంతా సాయంకాలమయే సరికి శృంగారించుకొని వాళ్లూ ఇరుగుపొరుగు వాళ్లూ హాస్యాలాడుకొంటో నవ్వుతో తృప్తితో కులాసాగా నుండే వారు. ఇది కొంచెం శుభ్రమైన చీర కట్టుకొంటే శుభ్రముగా తల దువ్వుకొంటే సహించలేక పోయేవారు. ఏవో పేర్లు పెట్టేవారు. నవ్వితే నీ కంతకులు కేమని ఏడుస్తే నిండింట్లో ఆలా ఏడుస్తావు మేము సుఖంగా ఉండడం నీకు కిట్టదా అని ఈలా ఒకటేమిటి శూలాల్లాంటి మాటలాడి ఆమెను చాలా బాధిస్తో ఉండేవారు.

ఒక రోజున ఇదంతా నాతో చెప్పుకొని యేడ్చి ఇక నాకెక్కడ దిక్కులేదు, ఈ యింట్లో నేను బ్రతకలేను. నాకు గతేమిటని అడిగిండే. నీవు రహస్యంగా వచ్చివేయి. నిన్ను చెన్నపట్నంలో పాఠశాలలో చేర్పిస్తాను. అక్కడ మా అన్నయ్య ఉన్నాడు కదా నీకేమీ భయము లేదని చెప్పాను, వప్పుకొన్నాదామె. ఆమెను చెన్నపట్నం తీసుకొనివెళ్లి పాఠశాలలోను హాస్టల్లోను చేర్పించాడు మా అన్నయ్య. స్కాలరుషిప్పు కూడా లభించింది.

తెల్లవారి అమ్మలక్కలంతా లేచారు. కాఫీ తయారు కాలేదు. కాఫీసంపటి ఊరికే ఉంది. ఏమయింది అవిడిగారు? ఇంకా నిద్ర మేలుకొన రాలేదు కాబోలు అమ్మగారు అంటోన్నారు. పెద్దన్నగారు లేచి సౌందర్యం అని పిలిచాడు సాధికారంగా. పలక లేదు. ఆమె పడుకొనే చోటికి వెళ్లారు. అక్కడ లేదామె. దొడ్లోకి వెళ్లిందేమో అనుకొన్నారు. అక్కడా లేదు. ఇరుగు పొరుగు ఇళ్లు వెతికారు. ఎక్కడా లేదు. ఎవరినో తీసుకొని లేచి పోయిందన్నారు. అన్నగార్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. వదినగార్లు చిత్ర విచిత్రమైన కథలు చెబుతున్నారు ఆమెను గురించి. ఇక యిరుగు పొరుగువారి సంగతి చెప్పాలా? భర్తలేని అనాథ బాలిక. ఆదరించే తండ్రి లేదు. కడుపులో పెట్టుకొనే తల్లి లేదు. ఎండిపోయిన చెర్లోని చేపలాగ బయటపడింది. అందఱకూ లోకువే.

రెండు సంవత్సరాలయాయి. సౌందర్యవల్లి థర్డుఫారము పోర్తుఫారములో చాలా జయప్రదంగా కృతార్థురాలై ఫిఫ్తుఫారము లోకి వచ్చింది. ఉపాధ్యాయినులందఱి దయకూ పాత్రురాలైంది. వాళ్లంతా ఎంతో గౌరవిస్తోన్నారు. పాఠశాలలోని బాలికలందఱూ ఆమె స్నేహము నభిలషిస్తోన్నారు. తన దుఃఖమంతా మరచి పోయింది. చాలా సరదాగా, సంతోషముగా కాలం గడచి పోతోంది, తన కింక పరవాలేదు స్వతంత్రంగా సుఖంగా నావ లెనే తానుకూడా జీవితమును గడపవచ్చు ననుకొన్నది. ఫిఫ్తు ఫారములోనుండగా చెన్నపట్నంలో ఇంటరు స్కూలు పోటీ డిబేటు పెట్టారు తెలుగులో. చెన్నపట్నానికంతకూ ఫస్టుప్రైజు దీనిదే. పేపర్లో వేశారు ఆమె పేరు. వాళ్ల ఊళ్లోని రీడింగు రూములో ఎవరో చూచారు ఆమె పేరు పేపర్లో. పరుగెత్తుకొని వచ్చి అన్నగార్లతో చెప్పారు. ఇంట్లో గడవటం లేదు వీళ్లకి. ఆ పల్లెటూళ్లో పనిచేసేవాళ్లు దొరకరు. ఆఁ! అది చెన్నపట్నమే పోయింది? ఆడ దానికి చదువేం. అందులోను వితంతువుకు. పైగా పేపర్లలోకూడా పడడమా? దీని పని పట్టిస్తామన్నారు. పెద్దన్నగారు పరుగెత్తాడు చెన్నపట్నం. అక్కడి ఉపాధాయినులతోను, చెలెలితోను ఎంతో చక్కగా మాట్లాడాడు. ఆమె మేనల్లునకు చాలా జబ్బుగానున్నదనియు అత్తకొఱకు పలవరిస్తోన్నాడనియు ఒకసారి పంపమనియు అడిగాడు. పాపం మా సౌందర్యముకూడా తన వెనుకటి కష్టాలన్నీ మరచిపోయి

అన్నగారి మాటలు నమ్మి మేనల్లునిమీద తనకుగల ప్రేమ తనను తొందరపెట్ట బయలుదేరింది.

ఇంటికి వచ్చారు. మేనల్లునకు జబ్బూలేదు ఏమీలేదు. వదినగార్లు మూతులు విరిచారు. ఇరుగుపొరుగువారు వింతజంతువును చూస్తోన్నట్లు చూస్తోన్నారు. అన్నగార్లు తిట్టారు. అప్పుడు దానికి పద్దెనిమిదవ యేడు. మంచి యౌవ్వనంలో ఉందేమో పోతపోసిన బంగారపు బొమ్మలా ఉంది. నుగ్గు నుగ్గుల జుట్టు తుమ్మెద రెక్కలలాగ అతి నలుపు. మంచి పొడవుకూడాను దాని జుట్టు. మరునాడు మంగలివాడు వచ్చాడు. ఇంట్లో వాళ్లంతా గుసగుసలాడుకొంటోన్నారు. ఆమె కేదో పెద్ద గాబరా బయలుదేరింది. ఈ చెరలోనుంచి బయటపడే మార్గంలేదు. దొడ్లోకి వెడుతోన్నట్లు బయలుదేరి వాళ్ల తోటలోని నూతిలో పడిపోయింది. పాలికాపు విన్నాడు ధ్వని. నలుగురూ పోగయారు. పయికి తీశారు. ఇక దీని నీలా వుంచకూడదన్నారు. నలుగురూ పట్టుకొని క్షౌరం చేయించారు. అప్పటినుండీ దానికి మతిపోయింది. నేను వెడితే నన్ను చూచి ఏడుస్తుంది. ఇంట్లోవాళ్లమీద మండిపడుతుంది. ఇది చాలక మదపిచ్చి అనీ, అదనీ, ఇదనీ లేనిపోని పేర్లు పెట్టి దానికింకా పిచ్చెక్కిస్తోన్నారు వీళ్లు. పాపం ఒక్కొక్కప్పుడు దయ్యం పట్టిందని ఎప్పుడో చచ్చిపోయిన దాని మొగుడు వచ్చి బాధిస్తోన్నాడనీ దాన్ని పట్టుకొని చావకొడతారు ఈ పరమ మూర్ఖులు."

ఈ యిరువదవ శతాబ్దంలోకూడా యింకా యింత మూర్ఖత ఉందా ప్రజలలో అనిపించింది. ఆ బాలికను తలచుకొంటే నా గుండె బ్రద్దలైపోతుంది. కాని ఏమి చేయగలను?


భారత్ కమర్షియల్ కార్పొరేషన్

అండ్

ప్రభాకర్ టెక్స్టైల్సు

తిండి, బట్ట - యీ రెండే జీవయాత్రకు ముఖ్యాధారాలు. జీవశక్తినిచ్చే పరిశుభ్రమైన ఆహారం, కళాకాంతులను విరజిమ్మే వస్త్రాలూ ప్రజలకు విరివిగా సరఫరా చేయడమే మా వ్యాపారముయొక్క ఆదర్శం

హార్లిక్సు మొదలగు ఆహారపదార్థాలు మిల్లు గుడ్డలు, చేనేత గుడ్డలు, శిల్కు వస్త్రాలు మావద్ద నాణ్యమైన సరుకులు, సరసమైన ధరలకు దొరుకును.

**BHARAT COMMERCIAL CORPORATION**

**AND**

**PRABHAKAR TEXTILES**

**Govindappa Naicken Street, Madras**

*Partners:*

**Sri M. S. APPARAO GARU,** *Zamindar of Vuyyur & Amara Gurunadham*